సాక్షి వికారాబాద్

మంగళవారం। 27। మే। 2025



ఉల్లి నిల్వకు నేలమాళిగలు

సరైన ధరలు లేకపోవడంతో ఉల్లి పంటను నిల్వ చేసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



రైతులతో మమేకం..

రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో శాస్త్రవేత్తలు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. 8లో▸



యువవికాసం.. ఎవరిపరం

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఆదర్శ తులసీ నగర్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ 15వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఉదయం 6గంటలకు స్వామివారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. ధ్వజారోహణం, గణపతి హోమం, అభిషేకం, భగవద్గీత పారాయణం చేశారు. అనంతరం భక్త సురేష్‌చే ప్రవచనం, పలువురు పేరిణి శివతాండవంతో అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి విఘ్నేశ్వరున్ని దర్శించుకున్నారు.

గోవుల అక్రమ రవాణా నేరం



గౌతాపూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్

తాండూరు రూరల్: గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని తాండూరు – చించోళి మార్గం గౌతా పూర్ సమీపంలో పోలీస్ చెక్‌పోస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 7న బక్రీద్ పండుగ ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గోవులు, లేగ దూడల తరలింపు నేరమన్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు నిఘా పెంచామని తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలి

సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లేష్



పరిగి పట్టణంలో నిరసన తెలుపుతున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం కావాలనే మావోయిస్టులపై కాల్పులు జరిపించి.. ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లేష్, మహేందర్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా సోమవారం పరిగి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 500 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపారని పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ అమాయక ఆదివాసులపై దాడులు చేసి హతమార్చడం సరికాదన్నారు. మావోయిస్టు జాతీయ కార్యదర్శి కేశవరావును పట్టుకుని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ పేరుతో కథలు అల్లుతున్నారని విమర్శించారు. అడవి సంపదను ఇతర దేశాలకు తరలించే కుట్రలో భాగంగా ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయన్నారు. వీటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, శ్రీశైలం, నర్సింహులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్

తాండూరు టౌన్: పట్టణంలోని పాత శాలివాహన కళాశాల మైదానంలో రేపు (28వ తేదీ బుధవారం) జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు రాము సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8, 10, 12 ఏళ్ల వయసు గల బాల బాలికలకు రన్నింగ్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులు తహసీల్దార్‌చే జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రంతో నేరుగా రేపు ఉదయం 9గంటలకు మైదానానికి రావాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 89782 34447, 63000 75229లలో సంప్రదించాలన్నారు.

ఒకేసారి మూడు నెలల కోటా

రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి కసరత్తు



- జూన్ ఒకటి నుంచి 30వరకు సరఫరా
- ఐదు జిల్లాల నుంచి బియ్యం దిగుమతి
- ప్రతి నెలా ఇచ్చేది 5,782 మెట్రిక్ టన్నులు
- మూడు నెలల కోటాకు 17 వేల మెట్రిక్ టన్నులు అవసరం
- స్టాక్ నిల్వకు గోదాముల కొరత

వికారాబాద్: ఒకేసారి మూడు నెలల(జూన్, జూలై, ఆగస్టు)కు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ ఒకటి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే మన రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో కొంత ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను అధిగమించి మూడు నెలల కోటా ఒకేసారి ఇచ్చేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ పౌరసరఫరాల శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం క్షేత్రస్థాయి అధికారులు, డీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. సాధారణంగా నెలలో 15 రోజులు మాత్రమే బియ్యం పంపిణీ చేసేవారు.. ప్రస్తుతం ఒకేసారి మూడు నెలల కోటా ఇస్తున్నందున గడువుతో సంబంధం లేకుండా లబ్ధిదారులు తీసుకెళ్లే వరకు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

సమస్యలను అధిగమిస్తేనే..

ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యం ఒకే నెలలో పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో పలు సమస్యలు ఎదురుకానున్నాయి. గతంలో కోవిడ్ సమయంలో మాత్రమే ఒకేసారి రెండు నెలల కోటా ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ఒకటి లేదా రెండు నెలల కోటాను పంపిణీ చేసేందుకు మెకానిజం ఉండగా మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేయాలంటే మాత్రమే పలు సమస్యలను అధిగమించాల్సి ఉంది. కోటా నిల్వకు సరిపడా గోదాములను సమకూర్చుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో గ్రామాల్లో డీలర్ల దగ్గర కూడా మూడు నెలల కోటా ఒకే సారి నిల్వ చేయటానికి సరిపడా స్థలాలు లేకపోవటం కూడా సమస్య కానుంది. అయితే ఇతర జిల్లాల నుంచి వచ్చిన బియ్యం వచ్చినట్టు గ్రామాలకు చేరవేయటం ద్వారా గోదాముల కొరతను అధిగమించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎప్పటిలాగే నెలలో 15రోజులు కాకుండా నెల మొత్తం బియ్యం పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 2,48,745 రేషన్ కార్డులు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 1.30లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా యాసంగిలో 90వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం పంపిణీ చేసే సమయంలో జిల్లాలో పండిన వడ్ల ద్వారా సీఎంఆర్ రూపంలో సేకరించినవి సరిపోయేవి. ప్రస్తుతం సన్నబియ్యం ఇస్తున్నందున జిల్లాలో వచ్చే దిగుబడి సరిపోవడంలేదు. కొనుగోలు కేంద్రాలకు ఐదు శాతానికి మించి సన్నరకం వడ్లు రావడం లేదు. ఇవి కేవలం మూడు నెలలకు మాత్రమే సరిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకే సారి మొత్తం బియ్యం ఇచ్చేస్తే ఆ తర్వాత పంపిణీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 2,48,475 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా 5,782 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒకేసారి మూడు నెలల కోటా బియ్యం అంటే 17వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు పండించిన సన్నరకం వడ్లను ఎక్కువ శాతం బహిరంగ మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. దీంతో సన్నబియ్యం కోసం పక్క జిల్లాలపై ఆధారపడక తప్పడంలేదు. ప్రస్తుతం మూడు నెలల కోటాకు సంబంధించి మన పక్క జిల్లాలు అయిన నారాయణపేట, సంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. లబ్ధిదారులకు మూడు నెలల కోటా బియ్యం అందజేస్తాం. ఇప్పటికే క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



హకీంపేట్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులు

బ్యాంక్‌లో పరిహారం సందడి

పారిశ్రామికవాడ భూ బాధితులతో కిటకిట

- నిత్యం కోట్ల రూపాయల లావాదేవీలు
- ఫిక్స్‌డ్ డిపాజిట్లు మేలంటున్న బ్యాంకర్లు

దుద్యాల్: దుద్యాల్ మండలం హకీంపేట్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నిత్యం రైతులతో కిటకిటలాడుతోంది. పారిశ్రామికవాడ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం ఇటీవల పరిహారం అందజేసిన విషయం తెలిసిందే. హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి, పులిచర్లకుంట తండాకు చెందిన రైతుల ఖాతాలు ఈ బ్యాంకులోనే ఉన్నాయి. ఇక్కడే పరిహారం చెక్కులు డిపాజిట్ చేశారు. ఒక్కో ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందడంతో వందల మంది రైతులు వారివారి ఖాతాల్లో డబ్బు జమ చేశారు. దీంతో నిత్యం కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని బ్యాంకర్లు తెలిపారు. ప్రస్తుతం బ్యాంకులో ఉన్న మొత్తం సరిపోక ప్రధాన బ్రాంచ్ నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తెస్తున్నట్లు తెలిసింది.

క్రాప్ లోన్ కట్టాలి

పారిశ్రామికవాడ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు సంబంధించిన పంట రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని బ్యాంక్ అధికారులు తెలిపారు. తీసుకున్న రుణాలు సకాలంలో కడితినే ఖాతాదారుల సిబిల్ స్కోర్ పడిపోకుండా ఉంటుందని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో లోన్లు పొందేందుకు ఆస్కారం లేకుండా పోతుందని రైతులకు సూచిస్తున్నారు.

డిపాజిట్లు చేసుకోవడం ఉత్తమం



హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి, పులిచర్లకుంట తండాకు చెందిన రైతులకు పరిహారం డబ్బు అందింది. వచ్చిన డబ్బు ద్వారా ఆస్తులు కొనుగోలు చేస్తే మంచిది. లేకుంటే బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు రావు.

– హరీష్‌కుమార్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్, హకీంపేట్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో 320 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. మొదటి విడతలో ఎంపికైన వారికి పథకం మంజూరు పత్రాలు అందజేశామని తెలిపారు. త్వరలో రెండో విడత లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, పీఏఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, నాయకులు భీంరెడ్డి, సత్యహరిశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రజావాణి కార్యక్రమంలో జనం ఇచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి హాజరయ్యే జిల్లా అధికారులు సమయపాలన పాటించాలన్నారు. ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం 125 అర్జీలు వచ్చాయని తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు



ముజాహిద్‌పూర్ కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ప్రహ్లాద్‌రావు

కుల్కచర్ల: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ధాన్యం తూకం వేయడం లేదన్నారు. అలాగే సేకరించిన వడ్లను మిల్లుకు తరలించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయకపోవడంతో రైతు లు కళ్లల్లోనే ధాన్యం ఉంచారని, వర్షాలకు తడిసి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్నరకం వడ్లలకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ధాన్యం కొనుగోలు చేస్తోందని మద్దతు ధర(రూ.2,320) కేంద్ర ప్రభుత్వామే రైతులకు చెల్లిస్తోందని వివరించారు. వెంటనే కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు చంద్రలింగం, మోనాచారి, బిచ్చయ్య, నరేష్, అంజి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణలో సమస్తం నేర్చుకోవాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం



పాల్గొన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లు

అనంతగిరి: క్షేత్రస్థాయిలో వాస్తవికతను పరిశీలించి నివేదిక అందజేయాల్సిన బాధ్యత సర్వేయర్లపై ఉంటుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం మద్గుల్ చిట్టంపల్లిలోని డీపీఆర్‌సీ భవనంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టానికి అనుగుణంగా భూముల సర్వే నిమిత్తం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి విడతలో వికారాబాద్ జిల్లాలో 151 మందికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను శిక్షణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా భూ సర్వే ప్రక్రియ చేపట్టేందుకే శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శిక్షణ సమయంలో అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శిక్షణ పొందుతున్న వారు భూభారతి చట్టంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. భూ వివాదాల జోలికి వెళ్లరాదని, అలాగే ప్రభుత్వ భూములను గుర్తించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ సామగ్రి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కేశవ్, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్‌లో భారీ వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అనంతగిరి: వికారాబాద్‌లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. వరద నీటిలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేద్దాం

- సర్కారు బడుల్లోనే పిల్లలను చేర్పించాలి
- డీఈఓ రేణుకాదేవి
- విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



సమావేశానికి హాజరైన తల్లిదండ్రులతో డీఈఓ రేణుకాదేవి, అధికారులు

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని డీఈఓ రేణుకాదేవి తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఉంటాయన్నారు. నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. పౌష్టికాహారం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం శ్రీశైలం మాట్లాడారు. ప్రైవేటుకు ఏ మాత్రం తీసిపోకుండా బోధన అందిస్తున్నట్లు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 500ల పైచిలుకు మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం పదో తరగతిలో 538 మార్కులు సాధించిన విద్యార్థిని భవానీని సన్మానించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాబు సింగ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరేశం, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలి

- మంత్రి సీతక్క, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరిన నాగారం దళితులు

ధారూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు పోటీ చేసే అవకాశం కల్పించాలని ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన దళితులు కోరారు. సోమవారం రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుంచి నేటి వరకు సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో తమకు పోటీ చేసే అవకాశం కల్పించలేదని తెలిపారు. 70 సంవత్సరాల నుంచి తమకు రిజర్వేషన్ సౌకర్యం లేక సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు దూరంగా ఉన్నామని పేర్కొన్నారు. గ్రామంలో 1,500 జనాభా ఉండగా ఎస్సీలు 400మంది ఉన్నారని, రానున్న ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ పదవులకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి సీతక్క, ఎన్నికల కమిషన్ అధికారి సానుకూలంగా స్పందించారని నాయకులు సుకుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, గణేశ్, నాగరాజ్ తెలిపారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాగారం దళిత నాయకులు

క్లుప్తంగా

బాల్య వివాహాలు నేరం

- ప్రోత్సహించినా, సహకరించినా చర్యలు తప్పవు
- ధారూరు ఎస్‌ఐ అనిత



మాట్లాడుతున్న ఎస్‌ఐ అనిత

ధారూరు: సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధారూరు ఎస్‌ఐ అనిత సూచించారు. కేరెల్లిలోని సత్యసాయి సార్వజనిక కేంద్రంలో సోమ వారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవగాహన లేక అనేక మంది సైబర్ నేరాల బారిన పడి నష్టపోతున్నారని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, వీటిని ప్రోత్సహించినా, సహకరించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. వివాహాలు చేసుకునే యువతీ, యువకులకు 18, 21 సంవత్సరాలు నిండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సార్వజనిక కేంద్రం సభ్యులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కకాటు నిర్లక్ష్యానికి ప్రాణం బలి

తాండూరు రూరల్: రేబిస్ వ్యాధితో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్దేముల్ మండలం ఇందూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రవీణ్(32) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం కుక్క కాటుకు గురయ్యాడు. చికిత్స తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించాడు. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు రావడంతో ఆదివారం ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు తాండూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. పరీక్షించి వైద్యులు ప్రవీణ్‌కు రేబిస్ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితుడు సోమవారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఉల్లి నిల్వకు నేలమాళిగలు

- ధర లేకపోవడంతో పంట స్టోరేజీకి ప్రాధాన్యం ఇస్తున్న రైతులు
- పొలాల్లోనే నేలమాళిగల తయారీ
- ప్రభుత్వమే షెడ్లు నిర్మించాలని అభ్యర్థన



మోమిన్‌పేటలోని ఏన్కతలలో ఓ రైతు వేసిన నేలమాళిగ

మోమిన్‌పేట: సరైన ధరలు లేకపోవడంతో ఉల్లి పంటలను నిల్వ చేసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేకపోవడం, ప్రైవేటు స్టోరేజీల్లో నిల్వ చేసేందుకు ఎక్కువ ఖర్చవడం వంటి కారణాలతో పొలాల వద్దే నేలమాళిగలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

తయారీ ఇలా..

చుట్టూ గుంజలు(బలమైన కట్టెలు) పాతి, నిలువుగా కంది కట్టె కడుతారు. మధ్యలో గ్రానైట్ రాళ్లు పెట్టి, వీటిపైనుంచి కట్టెలు పెడుతారు. ఆతర్వాత కంది పొరక, వరి గడ్డితో నింపుతారు. అనంతరం ఉల్లిగడ్డ వేసి, గడ్డి, ఆకులతో కప్పు వేస్తారు. దీనిపైనుంచి టార్పాలిన్ వంటి కవర్లతో కప్పేస్తారు. ఇలా అన్ని దిక్కుల నుంచి వెలుతురు, గాలి తగిలేలా చూసుకుంటారు.

ఆగస్టు, సెప్టెంబర్‌లో బయటకు

మేకవనంపల్లి, రాళ్లగుడుపల్లి, కాస్లాబాద్, ఏన్కతల, దేవరంపల్లి, మోమిన్‌పేట, ఏన్కెపల్లి, కోల్కుంద గ్రామాల్లో రైతులు ఎక్కువగా ఉల్లి సాగు చేస్తారు. జనవరిలో నాటిన ఉల్లిని ఏప్రిల్ చివరన, మే మొదటి, రెండో వారంలో బయటకు తీస్తారు. ఈ సమయంలో మంచి రేటు పలికితే ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తారు. లేదంటే నేలమాళిగల్లో నిల్వ చేస్తారు. మంచి ధర పలికే సమయంలో బయటకు తీసి విక్రయిస్తారు. సుమారు మూడు నుంచి నాలుగు నెలల వరకు నిల్వ ఉంచుతారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అమ్మేస్తారు. అప్పుడు కూడా సరైన ధర లేకపోతే మరికొంత సమయం వేచి చూస్తారు.

తక్కువ ఖర్చు...

ఎకరా పొలంలో సాగు చేసిన ఉల్లిని నిల్వ చేసేందుకు నేలమాళిగలు తయారు చేసేందుకు సుమారు రూ.4 వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. స్వయంగా పనిచేసుకుంటే ఇది మరింత తగ్గుతుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం క్వింటాలుకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు పలుకుతోందని ఈ సమయంలో అమ్ముకుని నష్టపోయేకన్నా.. ఇలా చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు.

వర్షాలు, తుపాన్లతో ఇబ్బంది

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సరైన తీరులో నిల్వ చేయకపోతే పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉంది. భారీ వర్షాలు కురిసినా, రోజుల తరబడి తుఫాన్ ఉన్నా ఇబ్బందే. దీనికి తోడు నేలమాళిగలకు అగ్ని ప్రమాదాలతో నష్టం కలుగుతుంది. బీడీ, సిగరెట్ ముక్కలు కాల్చి పడేయటం వలన ఇలాంటివి సంభవిస్తుంటాయి.

షెడ్లు నిర్మిస్తే మేలు

మహారాష్ట్రలో మాదిరిగా ఉల్లి సాగు చేసే రైతులకు ప్రభుత్వమే అండర్ గ్రౌండ్ షెడ్లు నిర్మించి ఇవ్వాలి. ప్రభుత్వ భూముల్లో వీటిని నిర్మించడం ద్వారా అందరికీ ఉపయోగకరంగా ఉంటాయి. రైతులకు కూడా పంట నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

ధర తక్కువగా ఉండటంతో..



నేను రెండెకరాల్లో ఉల్లి సాగు చేశా. సుమారు 22 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ధర లేకపోవడంతో నేలమాళిగ తయారు చేయించా. ఇందులో నిల్వ చేసి ధర పెరిగిన తర్వాత విక్రయిస్తా.

– నారాయణరెడ్డి, రైతు, ఏన్కతల

పిడుగు పడి గేదె మృతి



పంచనామా నిర్వహిస్తున్న వెటర్నరీ సిబ్బంది

యాలాల: పిడుగు పడి ఓ గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని విశ్వనాథ్‌పూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాములు ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం తన పశువులను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. కొంత దూరంలో గడ్డి మేస్తున్న గేదె సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ విషయాన్ని పశువైద్య శాఖ అధికారులకు తెలియజేయడంతో సోమవారం ఘటన స్థలానికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. జీవనాధారమైన గేదె మృతితో తనకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

రోడ్డు అంచు.. ప్రమాదపు ఉచ్చు!



ప్రమాదకరంగా ఉన్న నీళ్లపల్లి–మైల్వార్ రోడ్డు

- రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం
- ఆందోళనలో వాహనదారులు

బషీరాబాద్: మండల పరిధిలోని నీళ్లపల్లి మైల్వార్ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డును డబుల్‌గా విస్తరించేందుకు నిధులు మంజూరయ్యాయి. పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ దారిని ఓ పక్కన తవ్వి వదిలేశాడు. దీంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ కనీసం ప్రమాద సూచికలు, రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, అదుపుతప్పినా అంతే సంగతులు. ఇలా ఇప్పటికే పదుల సంఖ్యలో యాక్సిడెంట్లు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకట్‌స్వామి మాట్లాడుతూ.. మండలంలో అన్ని ప్రభుత్వ, కేజీబీవీ, ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిందన్నారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇప్పటికీ మండలంలో 80శాతం పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మిగతావి కూడా త్వరలో రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, సీఆర్‌పీ నారాయణ ఉన్నారు.

భారీ వర్షానికి తడిసిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల తిప్పలు
- తూకం వేయడంలో జాప్యం



పగిడియాలలో పొలం వద్ద నిల్వ ఉంచిన ధాన్యం



బెన్నూరు కేంద్రంలో వరద నీటిలో ధాన్యం రాశులు మొలకెత్తిన వడ్లు

యాలాల: ఆరుగాలం శ్రమించిన అన్నదాతల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది. కొనుగోలు కేంద్రాలను తీసుకొచ్చిన ధాన్యం తడిసి అపార నష్టాన్ని మిగిల్చింది. తూకం వేయడంలో జాప్యం కారణంగా పడిగాపులు కాయాల్సి వస్తుందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పేర్కొంటున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్న అధికారుల మాటలు నీటి మీద రాతలుగా మారాయని ఆరోపించారు. మండలంలో ఎక్కువగా వరి పంటను సాగు చేస్తుంటారు. ఇటీవల డీసీఎంఎస్, ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ సమయానికి సంచులతో పాటు తూకాలు, ధాన్యం తరలింపులో జాప్యం జరగడంతో కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాశారు. సోమవారంతోపాటు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బెన్నూరు, రాస్నం, సంగెంకుర్దు, తిమ్మాయిపల్లి, యాలాల, లక్ష్మీనారాయణపూర్, అగ్గనూరు, దేవనూరు తదితర కేంద్రాల్లో ధాన్యం తడిసింది. దీనికితోడు పలు కేంద్రాల్లో తేమ కోసం ఆరబెట్టిన ధాన్యం మొలకెత్తింది. ప్రభుత్వ మద్దతు ధర కోసం రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాసిన సకాలంలో తూకం, తరలింపు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన వడ్ల విషయంలో ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

షరతుల్లేకుండా కొనాలి



ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన ధాన్యంతో పాటు మొలకెత్తిన వడ్లను ప్రభుత్వ మద్దతు ధరతో ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి. కేంద్రాల్లో గన్నీ సంచులు, తూకాలు, రవాణా తదితర విషయాల్లో అధికార యంత్రాంగం విఫలమైంది. బెన్నూరు, లక్ష్మీనారాయణపూర్, యాలాల తదితర కేంద్రాల్లో రైతుల ధాన్యం పూర్తిగా తడిసి మొలకెత్తింది. యంత్రాంగం స్పందించి షరతులు లేకుండా కొనుగోలు చేయాలి.

– శివకుమార్, ఈజీఎస్, స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు

నష్టపోతున్న రైతులు



సుల్తాన్‌పూర్‌లో మొలకెత్తిన వరిధాన్యం

పరిగి: ఇటీవల కురుస్తున్న వర్షానికి కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో మోస్తరు వాన కురిసింది. కల్లాల్లోని ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆలస్యం కావడంతో నష్టపోతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం మాటలు అమలు కావడం లేదని కర్షకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలులు త్వరితగతిన అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రైతులతో మమేకం.. సాగుకు సన్నద్ధం

ఉత్సాహంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- వానాకాలం సాగుపై అవగాహన
- గ్రామాల్లో కొనసాగుతున్న సదస్సులు



రుద్రారం రైతువేదికలో అవగాహన కల్పిస్తున్న తాండూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు (ఫైల్)

కొడంగల్ రూరల్: రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంలో శాస్త్రవేత్తలు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా వానాకాలం సాగుకు సమాయత్తం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం(తాండూరు ఏరువాక కేంద్రం) ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' సదస్సులను నియోజకవర్గంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. సదస్సులకు రైతుల నుంచి మంచి స్పందన వస్తోందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాజమాన్య పద్ధతులతో ఆధునిక వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వాడకం, భూసార పరీక్షలు, పంట మార్పిడి పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. శాస్త్రవేత్తలతోపాటు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు రైతులకు పంటల సాగులో మెలకువలపై సూచనలు చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి జూన్ నెల 13వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆరుసూత్రాలతో సాగు బాగు

రైతులు తక్కువ ఖర్చుతో ఆరు సూత్రాలను ఆచరించి మెలకువలు పాటిస్తే మంచి దిగుబడితోపాటు ఆర్థికంగా లాభాలు గడించే అవకాశం ఉంటుందని సదస్సుల ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చు తగ్గించుకోవడం, అవసరమైనంతలోనే రసాయనాలను వినియోగించడం, రశీదులను భద్రపరచడం, కష్టకాలంలో నష్ట పరిహారం పొందడం, సాగునీరు ఆదా చేయడం, భావి తరాలకు అందించడం, పంట మార్పిడితో సుస్థిర ఆదాయం పొందడం, పొలం గట్లపై చెట్లను పెంచడం పర్యావరణ సమతుల్యత కాపాడడం వంటి ఆరు సూత్రాలతో అన్నదాతలకు అవగాహన కల్పిస్తూ సదస్సులను నిర్వహిస్తున్నారు. దీంతో వ్యవసాయ పద్ధతుల్లో విశేష మార్పులు వచ్చే అవకాశం ఉందని ఆరుగాలం శ్రమించిన కర్షకులు పేర్కొంటున్నారు.

విశేష స్పందన



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలతో వ్యవసాయాధికారులు సదస్సులు నిర్వహిస్తున్నారు. రైతులకు మేలైన సాగు పద్ధతులు, అధిక దిగుబడులు, ఆధునిక వ్యవసాయ విధానాలపై వివరిస్తున్నాం. సదస్సులకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

– శంకర్ రాథోడ్, ఏడీఏ, కొడంగల్

మేకులు కొట్టి.. బ్యానర్లు కట్టి!

రోడ్ల పక్కన చెట్లను ప్రచార సాధనాలుగా వాడుతున్న కంపెనీలు

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



తాండూరు- హైదరాబాద్ రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు మేకులు కొట్టి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ షీట్

ధారూరు: వివిధ ప్రైవేటు కంపెనీలు, షాపుల నిర్వాహకులు రోడ్ల పక్కన ఉన్న చెట్లను ప్రచార సాధనాలుగా వాడుకుంటున్నారు. వీటికి ఫ్లెక్సీలు, బ్యానర్లు కడుతున్నారు. ఫైబర్, ప్లాస్టిక్, ఐరన్‌తో తయారు చేసిన షీట్లను కొడుతున్నారు. ఇందుకోసం మేకులు వినియోగిస్తున్నారు. దీనిద్వారా మొక్కలు, వృక్షాలు ఎండిపోతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మనిషి శరీరంలో ఇనుప వస్తువు గుచ్చుకుంటే సెప్టిక్ అవుతుందని, ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోకపోతే క్రమేణా పుండుగా మారుతుందని చెబుతున్నారు. ఇలాగే చెట్లకు కొట్టిన మేకుల కారణంగా వాటికి పుండ్లవంటి గాయాలు ఏర్పడి ఈదురు గాలులకు విరిగిపోతున్నాయని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బ్యానర్లు, పోస్టర్లు కట్టిన, అతికించిన ఆయా ప్రైవేటు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుండెపోటుతో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

తాండూరు: ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పీబీ శ్రీనివాస్(55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఆయన ఆరేళ్లుగా తాండూరు సర్కిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం సెలవు పెట్టి మహబూబ్‌నగర్‌లోని ఇంట్లో ఉండగా గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట ఎగ్జిట్ వద్ద సోమవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. కోకాపేట సెక్టార్ ఎస్‌ఐ మురళీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోకాపేట ఎగ్జిట్ వద్ద ఓ వ్యక్తి రోడ్డుపై గాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు గుర్తించారు. అతని వివరాలు తెలియకపోవటంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

- బైక్ అదుపు తప్పడంతో ఘటన
- క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిస్తున్న డాక్టర్ రాజశేఖర్

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఎన్నారం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కోట్‌పల్లికి చెందిన సుదర్శన్, విజయలక్ష్మి దంపతులు మోటారు సైకిల్‌పై మర్పల్లి వైపు వెళ్తున్నారు. ఎన్నారం సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ తన కారులో అటుగా వెళ్తున్నారు. గాయపడిన దంపతులను చూసి వెంటనే తన వాహనంలోని మెడికల్ కిట్‌ను తీసి, ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్‌గఫార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను ఆటోలో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరంగల్ సమావేశానికి తరలిరావాలి

తాండూరు టౌన్: వరంగల్‌లో ఈనెల 31న నిర్వహించనున్న జాతీయ కార్యవర్గ సమావేశానికి మాదిగ సోదరులు పెద్దఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ కోరారు. సోమవారం తాండూరులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్‌తో పాటు అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాని, పరుశురాం, ఉమాశంకర్, బాలు, జగదీశ్, అరవింద్ పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు